క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


సుబ్రహ్మణ్యం

వీరఘట్టం: వంగర మండలం నుంచి వీరఘట్టానికి బదిలీపై వచ్చిన ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడారు. నీటి ఎద్దడి గ్రామాలపై దృష్టి సారించడంతో పాటు నిరంతర పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజారోగ్యమే లక్ష్యంగా సేవలు


శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

పాలకొండ: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం సేవలు అందిస్తోందని 17వ వార్డు కౌన్సిలర్ దుప్పాడ పాపినాయుడు అన్నారు. వార్డు పరిధిలోని పెదకాపు వీధిలో జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 290 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ ఆలయంలో వాటర్ ప్లాంట్


నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను చూపిస్తున్న ఈఓ మురళీకృష్ణ

పాలకొండ రూరల్: మండల కేంద్రంలోని కోటదుర్గమ్మ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక తాగునీటి వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ మురళీకృష్ణ తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులతో మమేకమై సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తులు అమ్మవారికి సమర్పిస్తున్న కానుకలు, ఇతర వితరణలను సద్వినియోగపరుస్తున్నామన్నారు. ఇటీవల హుండీ కానుకలు లెక్కించగా 49 రోజుల వ్యవధిలో 6, 52,750 రూపాయల నగదు సమకూరినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భామిని: మండలంలోని బాలేరు కూడలిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వంటపుట్టి గౌడు మురళి తీవ్రంగా గాయపడ్డాడు. వంటలు చేసి ఇంటికి టీవీఎస్ ఎక్సెల్‌పై ఏబీ రోడ్డుపై వెళ్తుండగా పక్కగా వెళ్తున్న లారీ తగిలి ఈడ్చుకుపోయింది. దీంతో మురళి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. 108 అంబులెన్స్‌లో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. బత్తిలి ఏఎస్‌ఐ కె.కాంతారావు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సన్మానం..


వెంకటరమణను సన్మానిస్తున్న గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో పశువైద్య సహాయకుడిగా నాలుగు సంవత్సరాలు సేవలు అందించి శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లిన ఎస్. వెంకటరమణకు గ్రామస్తులు, సచివాల సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు మాట్లాడుతూ, వెంకటరమణ రైతులకు అందుబాటులో ఉంటూ ఎంతో విలువైన సేవలందించారని కొనియాడారు.

ఆర్‌బీకేలను సద్వినియోగం చేసుకోవాలి

పాలకొండ రూరల్: ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగ పరుచుకోవాలని లుంబూరు ఆర్‌బీకే వ్యవసాయ సహాయకుడు అమిత్‌పాడి అన్నారు. రైతుభరోసా మూడో విడత నిధులు విడుదలైన క్రమంలో ఆర్‌బీకేలో రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ పథకం ప్రారంభంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సందేశాన్ని వీడియో ద్వారా రైతులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధిక దిగుబడులు సాధించేందుకు చేపట్టాల్సిన మెలకువలపై వివరించారు.స

ఘనసర చేరిన ఏనుగుల గుంపు



భామిని: మండలంలోని ఘనసర గ్రామ సమీపానికి బుధవారం నాలుగు ఏనుగుల గుంపు చేరింది. తివ్వాకొండ పరిసరాల్లో ఇటీవల వరకు సంచరించిన ఏనుగులు తిరిగి ఘనసరకు చేరుకోవడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

బుల్లి శాస్త్రవేత్తలు...

బోలెడన్ని ఆలోచనలు

- అబ్బురపరచిన వైజ్ఞానిక ప్రదర్శనలు
- ఘనంగా సైన్స్ డే..


పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో సైన్స్‌డేలో విదార్థుల ప్రదర్శనలు

వీరఘట్టం: బుల్లి శాస్త్రవేత్తలు తమ ఆలచనలకు పదునుపెట్టారు. సైన్స్ డే సందర్భంగా మండలంలోని అన్ని విద్యా సంస్థలలో బుధవారం వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ఆరోగ్య సమాచారం, ప్లాస్టిక్ నిషేధం, వర్మీ కంపోస్టు తయారీ, దోమల నివారణ చర్యలు, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ ఆదా, సోలార్ విద్యుత్ తయారీ, సెల్ టవర్ల వల్ల ఏర్పడుతున్న రేడియేషన్, తదితర ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. రేగులపాడు కేజీబీవీ బాలికలు తమ ప్రదర్శనలతో అలరించారు. అలాగే కంబరవలస జిల్లా పరిషత్ హైస్కూల్, వీరఘట్టం బాలుర, బాలికోన్నత పాఠశాలలు, కత్తులకవిటి, తలవరం, బిటివాడ, వండవ హైస్కూళ్లలో పలువురు శాస్త్రవేత్తల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సైన్స్‌తోనే అభివృద్ధి..

పాలకొండ: సైన్స్‌తోనే అభివృద్ధి సాధ్యమని వెంకమ్మపేట ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం జి. పరాంకుశంనాయుడు తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ సీవీ రామన్ జీవిత చరిత్రను వివరించారు. అనంతరం ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. అలాగే సైన్స్ ఉపాధ్యాయిని నాగమణిని సన్మానించారు.

ఘనంగా జాతీయ సైన్స్ డే..

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో జాతీయ సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్ సీవీ రామన్, అబ్దుల్ కలాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలు కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం లీల్లీరాణి పాల్గొన్నారు.

అబ్బురపర్చిన బాల మేధావులు..

పాలకొండ రూరల్: జాతీయ సైన్స్ డే సందర్భంగా మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తాము రూపొందిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎం.సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బి.సంఘంనాయుడు నేతృత్వంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పీఎస్ ఉపాధ్యాయులు ఎల్‌వీ రమణతో పాటు సహోపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

ఘనంగా ..

భామిని: మండలంలోని పలు పాఠశాలల్లో సైన్స్ డే నిర్వహించారు. ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్‌లను ప్రిన్సిపాల్ ఆర్. శివకుమార్ పరిశీలించి, సైన్స్ డే విశిష్టతను వివరించారు. బత్తిలి జెడ్పీహెచ్ స్కూల్‌లో హెచ్ఎం ఆర్.వెంకటరమణ ఆధ్వర్యంలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. భామిని గురుకులం, గురండి పాఠశాలల్లో కూడా సైన్స్ డే కార్యక్రమాలు నిర్వహించారు.


వీరఘట్టం: వీరఘట్టం హైస్కూల్ విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు


వీరఘట్టం: సైన్స్ పితామహుడు సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కంబరవలస హైస్కూల్ సిబ్బంది


వీరఘట్టం: ఆకట్టుకున్న రేగులపాడు కేజీబీవీ విద్యార్థుల ప్రదర్శన


సీతంపేట: సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు చేస్తున్న హెచ్ఎం లిల్లీరాణి, తదితరులు


పాలకొండ: ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న విద్యార్థులు


భామిని: మోడల్ స్కూల్‌లో సైన్స్ డే సంబరాలు

ఘనంగా సైన్స్ డే

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి, బిత్రపాడు, జియ్యమ్మవలస పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. చినమేరంగి ఎంపీపీ (మేదర) పాఠశాలలో విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పిస్తూ చంద్రయాన్ నమూనాను తయారు చేయించారు. విద్యార్థులు ఇప్పటి నుంచే సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎర్రయ్య, వేణుగోపాల్, సుబ్బినాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.


జియ్యమ్మవలస: చంద్రయాన్ నమూనాను చూపిస్తున్న చినమేరంగి(మేదర) పాఠశాల విద్యార్థులు

సీఎం జగనన్న మమ్మల్ని గుర్తించారు..

- టైలర్ల సంఘ ప్రతినిధులు

పాలకొండ రూరల్: ప్రస్తుత రెడీమేడ్ పోటీ ప్రపంచంలో పనుల్లేక ఇబ్బంది పడుతున్న తమను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గుర్తించారని స్థానిక టైలర్ల సంఘ ప్రతినిధులు అన్నారు. ప్రపంచ టైలర్స్ డేను పురస్కరించుకుని పలువురు టైలర్లు బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన మార్కెట్ వద్ద ప్రారంభమైన ర్యాలీ వీరఘట్టం రహదారిలో గల వైఎస్సార్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా దర్జీలు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం వద్ద అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగనన్న తమను గుర్తించి పది వేల రూపాయల ఆర్థిక సాయం చేయడం గొప్ప విషయమన్నారు. అలాగే ఆయన వల్ల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫారాలు కుట్టే అవకాశం కలిగిందని చెప్పారు. అనంతరం సీనియర్ టైలర్లను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు గిరి శంకరరావు, టి.అప్పలరాజు, ఎస్. సంగమేశ్వరావు, ప్రకాష్, సతీష్, జగదీష్ తదితరులున్నారు.


వైఎస్సార్ విగ్రహం వద్ద అంజలి ఘటిస్తూ నినాదాలు చేస్తున్న టైలర్లు

వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.1.68 కోట్లు మంజూరు

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ద్వారా గుమ్మలక్ష్మీపురం మండలంలోని 8,364 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.1.68 కోట్లు సాయాన్ని జమ చేసిందని మండల వ్యవసాయ అధికారి సీహెచ్ ప్రసాద్ తెలిపారు. స్థానిక విలేకర్లతో ఆయన బుధవారం మాట్లాడారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే నాలుగేళ్ల పాటు రైతులకు ప్రభుత్వం సాయం అందించిందని, ఐదో ఏడాదిలో ఇప్పటికే రెండు విడతల్లో సాయాన్ని అందించిన ముఖ్యమంత్రి మూడో విడతగా గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన రైతులకు రూ.1.68 కోట్లను బటన్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశారని తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు


రావాడ రామభద్రపురంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ చీకటి శంకరరావు వైద్యపరీక్షలు బుధవారం నిర్వహించారు. డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు ఆదేశాల మేరకు వసతిగృహాల్లో వైద్య శిబిరం నిర్వహించామని తెలిపారు. మలేరియా, డెంగీ, రక్తహీనత మొదలైన వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమతెరలు వాడాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం ఎం.తిరుపతిరావు, ల్యాబ్ టెక్నీషియన్ ఆర్.సురేష్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆట స్థలంలో సైన్స్ ల్యాబ్

- ఉన్న భవనాలనే ఉపయోగించుకోవాలంటున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

వీరఘట్టం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అధికారుల అనాలోచిత చర్యలతో ఎంతో విలువైన ఆటస్థలానికి ముప్పు వాటిల్లుతోంది. ఇక్కడ కెమిస్ట్రీ ల్యాబ్ కట్టేందుకు 15,88,000 రూపాయల పీఎంసీ నిధులు మంజూరయ్యాయి. అయితే ఈ నిధులతో ఆట స్థలంలో కొత్త భవనం నిర్మించేందుకు ఎస్ఎస్ఏ అధికారులు సిద్ధం కావడం వివాదాస్పదంగా మారింది. పాఠశాలలో ఆరు పక్కా భవనాలు ఖాళీగా ఉన్నాయి. వీటికి చిన్న చిన్న మరమ్మతులు చేపడితే ఈ భవనాలు ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ఆట స్థలంలో ల్యాబ్ ఏర్పాటు చేస్తే విద్యార్థులు ఎక్కడ ఆడుకుంటారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ అధికారులు ఇక్కడి పరిస్థితిని పరిశీలించి పాఠశాలలో ఖాళీగా ఉన్న భవనాలను వినియోగించుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఆటస్థలంలో భవన నిర్మాణానికి తీసిన గోతులు

బీటీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే


కర్లగూడకు నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: మండలంలోని పాలెం జంక్షన్ నుంచి కర్లగండ గ్రామానికి రూ.2.56 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి బుధవారం ప్రారంభించారు. ఇంత వరకు తమ గ్రామానికి రోడ్డు లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు పడుతున్న తీవ్ర ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో పక్కా రోడ్డు నిర్మాణం కావటంతో గ్రామస్తులంతా హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు.

రావికోనకు బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

మండలంలోని కుంబికోట నుంచి రావికోన వరకు గల 5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి బుధవారం భూమి పూజ చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ఆమె వెంట కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లె సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు శెట్టి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో టోకు దేవతకు పూజలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎగువతాడికొండ, చాపరాయి జంగిడి భద్ర, కప్పకల్లు, శిఖరపాయి తదితర గ్రామాల గిరిజనులు సాంప్రదాయ బద్ధంగా టోకు దేవత పండగను నిర్వహిస్తున్నారు. రెండేళ్లకొకసారి నిర్వహించుకునే ఈ పండుగ సందర్భంగా ఆయా గ్రామాల్లోని గ్రామదేవతలకు పంటలు బాగా పండాలని, అంతా క్షేమంగా ఉండాలంటూ మొక్కుబడులు తీర్చుకుంటూ ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే మహిళలు తలకు వస్త్రాన్ని చుట్టుకొని, నెమలి ఫింఛన్లను చేత పట్టుకొని డప్పు, వాయిద్యాలు మోగిస్తుండగా నృత్యాలు చేస్తూ సమీప గ్రామాలకు వెళ్తూ వారి ఆచారాన్ని ప్రదర్శిస్తున్నారు. గిరిజనులు నిర్వహించే సంప్రదాయ పండుగల్లో ఈ పండుగ కూడా ప్రధానమైనది.


టోకు దేవత పండుగ సందర్భంగా నృత్యాలు చేస్తున్న మహిళలు

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

జియ్యమ్మవలస: మండలంలోని కన్నపుదొరవలస, బిత్రపాడు ఎంపీపీ, యూపీ పాఠశాలలను ఎంఈఓ 1 సామల సింహాచలం బుధవారం సందర్శించారు. టీచర్ల డైరీలు, లెసన్ ప్లాన్స్‌ను తనిఖీ చేశారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం టీచర్స్ డైరీలు, లెసన్ ప్లాన్స్, వర్క్‌బుక్ కరెక్షన్స్ సిలబస్ ప్రకారం పెండింగ్ లేకుండా పూర్తి చేసారా.. లేదా.. అనే విషయాలను పరిశీలించారు. ఇరు పాఠశాలల్లో అన్నీ సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులతో తెలుగు, ఆంగ్ల పాఠాలు చదివించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనాభ్యసన సామగ్రి పరిశీలించారు. తరగతి గదిలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగించాలని, వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్‌టి సోమేశ్వరరావు ఉన్నారు.


కన్నపుదొరవలస పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

మెరుగైన వైద్యసేవలు అందివ్వాలి


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి జగన్మోహనరావు

కొమరాడ: ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందివ్వాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని కూనేరు రామభద్రాపురం, కొమరాడ గ్రామాల్లోని పీహెచ్‌సీలను ఆయన ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలతో వస్తున్నారు, జ్వరాలు ఏ మేరకు నమోదౌతున్నాయి, వారికి నిర్వహిస్తున్న పరీక్షలు, అందజేస్తున్న చికిత్స తదితర వివరాలపై ఆరా తీసి రికార్డులు పరిశీలించారు. మలేరియా, డెంగీ, జ్వర నిర్ధారణ పరీక్షల రికార్డులు తనిఖీ చేశారు. వసతిగృహ విద్యార్థులు, మారుమూల గ్రామాల్లో జ్వర లక్షణాలు ఉన్న వారికి క్షేత్ర స్థాయి సిబ్బంది రక్త నమూనాలను సేకరించాలని ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీలో వ్యాక్సిన్ల నిల్వలు, వాటి నిర్వహణ విధానం తనిఖీ చేసి వచ్చే నెల 3న జరగబోయే పల్స్ పోలియో ఏర్పాట్లపై ఆరా తీశారు. ఆయన వెంట వైద్యాధికారులు అరుణ్‌కుమార్, ఏఎంఓ సూర్యనారాయణ, ఇతర సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకంలో నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ వై.సూర్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో టీఏలు, సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులకు వంద రోజులు పని దినాలను కల్పించాలన్నారు. వేతనదారులు రెండు పూటల పనులలో పాల్గొనేలా చూడాలన్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో వేతనదారుల హాజరును నమోదు చేయాలన్నారు. మార్చి నెలాఖరుకు వంద రోజులు పూర్తయ్యేలా చూడాలన్నారు. పని ప్రదేశంలో సౌకర్యాలను కల్పించాలన్నారు.


సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ

ఈవీఎం పనితీరుపై అవగాహన


ఈవీఎంలపై అవగాహన కలిగిస్తున్న తహసీల్దార్ వరహాలు

పాలకొండ: ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంల పనితీరుపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం స్థానిక నగరపంచాయతీ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ వరహాలు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ నరసింహులు పట్టణ ప్రజలకు ఈవీఎంల పనితీరును వివరించారు. అలాగే ఎలా ఓటు వేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


రైతులకు సూచనలిస్తున్న స్టేట్ రిసోర్స్‌పర్సన్ దేవుళ్లు

సీతంపేట: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని స్టేట్ రిసోర్స్‌పర్సన్ దేవుళ్లు అన్నారు. మండలంలోని జక్కరవలసలో 13 మంది రైతులు గులిరాగి పంటను సాగు చేయగా వారి పంటలను బుధవారం పరిశీలించారు. అనంతరం వాసన్ అనే సంస్థ ద్వారా వంద ఎకరాల్లో నీటి సదుపాయం కల్పించడానికి రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు బాలు, కళ్యాణపాత్రో, రమణ, ముసలయ్య పాల్గొన్నారు.

సవర భాషా ప్రచారకులకు శిక్షణ


శిక్షణకు వచ్చిన ప్రచారకులతో పాటు శిక్షకులు

భామిని: మండలంలోని మనుమకొండలో అక్షర బ్రహ్మ యువ నిర్మాణ సేవా సంఘం ఆధ్వర్యంలో సవర భాషా ప్రచారకులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకులు కె.కామేష్, ఎస్.వెంకటరావు, సవర బాబు, ఎస్.గంగారావు మాట్లాడుతూ, ఆదివాసీల మాతృభాషను రక్షించడంతో పాటు భాషాభివృద్ధి పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం సవర భాషా పుస్తకాలను పంపిణీ చేశారు.